# రమణభాస్కర

## (అప్పనపల్లిలో శ్రీనాన్నగారి ప్రవచనము, 25-4-96)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన హృదయంలో దేవుడు ఉన్నాడో, లేడో మనకు తెలియటంలేదు. దేహము, ఇంద్రియాలు, మనస్సు మనకు తెలుస్తున్నాయి. కొంతమంది దేహాన్ని పోషించటమే లక్ష్యంగా పెట్టుకొంటారు. ఏది ఆలోచించినా దేహాన్ని కేంద్రంగా పెట్టుకొని ఆలోచిస్తారు. జీవితం అంతా ఇంద్రియాలను సంతృప్తిపరచుకోవటంకోసమే జీవిస్తారు. మొసలిని దుంగ అనుకొని దానిని పట్టుకొని నదిని దాటుదామనుకోవటం ఎటువంటిదో మన దేహాన్ని, ఇంద్రియాలను సంతృప్తిపరచుకొంటూ ఆత్మను తెలుసుకొందామని అనుకోవటం అటువంటిది. మొసలిని దుంగఅనుకొని నదిని దాటటానికి మొసలిని పట్టుకొన్నవాడు నదిని దాటలేడుసరికదా మొసలిచేత భక్షింపబడతాడు. వాడు మొసలిని దుంగ అనుకొన్నట్లే మనం దేహబుద్ధిని ఆత్మ అనుకొంటున్నాము. దేహాన్ని ఆత్మఅనుకొనేవాడు, దేహమును కేంద్రంగా పెట్టుకొని జీవించేవాడు హృదయంలో ఉన్న ఆత్మని తెలుసుకోలేడు సరికదా సంసార ప్రవాహములో కొట్టుకొనిపోతాడు, మన బ్రతుకులుకూడా అలాగే ఉన్నాయి.

దేహము, మనస్సు నీడలు. నీలోపలఉన్న నిజం నీకు తెలియకపోవటంవలన ఇవే నిజం అని నీకు అనిపిస్తోంది. అసలువస్తువును వదిలేసి నీడను పట్టుకొంటున్నావు. అహంభావన ఒకనీడ. దానిని పట్టుకొంటున్నాము. దానిని పట్టుకొని జీవిస్తూఉంటే నీ హృదయంలోఉన్న ఈశ్వరుడు నీకు తెలియబడడు. నిజం తెలిసేవరకూ నిజంకానిది నిజం అనుకొంటావు. బింబాన్ని వదిలేసి ప్రతిబింబాన్ని పట్టుకొంటున్నావు. నీకు దేహబుద్ధి ఉన్నంతకాలం నీ హృదయంలో ఉన్న ఆత్మగురించి నీకు తెలియదు. పూజ, జపం, ధ్యానం, విచారణ ఇవి అన్నీ ఎందుకు ఏర్పాటుచేశారు అంటే మనస్సుకు పవిత్రత, ఏకాగ్రత రావటంకోసం. మనస్సును సంస్కరించుకోవటానికి ఇవి అన్నీ ఏర్పాటుచేశారు. వీటివలన మనోనిగ్రహం కలుగుతుంది. నిగ్రహింపబడిన మనస్సే అంతర్ముఖం అవుతుంది. అంతర్ముఖమైన మనస్సుకు ఆత్మానుభవం కలుగుతుంది.

సహజంగానే ఒకో మనిషికి ఒకో ప్రకృతి ఉంటుంది. ఒక మంచివాడు ఎప్పుడైనా పొరపాటు చేయవచ్చు అంతమాత్రంచేత వాడు చెడ్డవాడు కాడు. ఒక చెడ్డవాడు ఎప్పుడైనా మంచిచేయవచ్చు. అంతమాత్రంచేత వాడు మంచివాడు కాదు. నీ హృదయంలోఉన్న సద్వస్తువు సహజంగానే చావులేనిది, శాంతిపూరితమైనది, ఆనందపూరితమైనది, దుఃఖమునకు దూరమైనది, బాహ్యంగావచ్చే వికారములకు అతీతమైనది, ప్రకృతి విషయాలు అన్నింటికి అతీతమైనది. గురువు అనుగ్రహంవలన ఆ సద్వస్తువు నీకు ఎప్పుడైతే అనుభవంలోనికి వచ్చిందో అప్పుడు నీ శాంతి, సుఖం సహజంగా ఉంటాయి. అప్పుడు స్వతంత్రమైన సుఖం, శాంతి నీకు అనుభవంలోనికి వస్తాయి.

భగవంతుడు చెప్పినమాటలు మనం వింటున్నప్పటికీ మన మనస్సులో ఉన్న దోషాలు ఆ మాటలను నమ్మనివ్వవు. శాస్త్రాన్ని ప్రమాణంగా తీసుకొని, భగవంతుడు చెప్పిన మాటలను ప్రమాణంగా తీసుకొని దానియందు గౌరవాన్ని విశ్వాసాన్ని పెంచుకొని, భగవంతునికి ఎంతప్రాముఖ్యత ఇస్తున్నావో భగవంతుడు చెప్పిన మాటలకుకూడా అంత ప్రాముఖ్యత ఇస్తూ ఉంటే నీ హృదయంలో ఉన్న చావులేని వస్తువుతోటి

నీకు తాదాప్యం కలుగుతుంది. ఎప్పుడైతే ఆ వస్తువుతో తాదాప్యం కలిగిందో జననమరణచక్రం నిన్ను విడిచిపెట్టేస్తుంది. ఆ వస్తువు నీకు తెలియబడుతుంది. సమాధిస్థితిని, ఏకత్వస్థితిని నీవు ప్రాక్టీసుచేస్తే నీకు ఆ వస్తువు తెలుస్తుంది. గురువును ప్రేమిస్తూ, శాస్త్రముపట్ల విశ్వాసం కలిగిఉంటే ఆ వస్తువు నీకు తెలుస్తుంది.

దేహబుద్ధి ఒకరోజులో పోయేది కాదు. ఇది చాలాకాలంనుండి వస్తోంది. ఇది దీర్ఘరోగము. మనం దేహానికి పరిమితమై ఆలోచిస్తున్నాము. దేహమాత్రుడను నేను అని అనుకొంటున్నాము. ఏ జన్మలో ఉన్నప్పుడు ఆ దేహముతో తాదాప్యం చెందుతున్నాము. ఈ తాదాప్యంవలననే అన్ని చిక్కులు వస్తున్నాయి. నువ్వుకానిదానిని నువ్వు అనుకోవటంవలన అన్ని రుగ్మతలు వస్తున్నాయి. దేహబుద్ధి పోవాలంటే నీవు జాగ్రత్తగా సాధనచేస్తూ సమాధిస్థితిని ప్రాక్టీసుచేస్తే అది నశిస్తుందిగాని 5 నిమిషాలలో పోయేదికాదు అది దీర్ఘరోగం అంటున్నారు ఆచార్యులవారు. నీ శరీరానికి రోగంవస్తే ఔషదం ఎలా వాడతావో అలాగే నీ ఆకలికి సరిపడా ఆహారం తీసుకొంటూ, అక్కరలేని గొడవలకు వెళ్ళకుండా నీపనిఏదో నీవుచేసుకొంటూ ఇతరుల గొడవలలోనికి కలుగజేసుకోకుండా సమాధిని ప్రాక్టీసుచేస్తూ, సత్యాన్ని ప్రాక్టీసుచేస్తూ ఇలా కొన్ని జన్మలు సాధనచేయగా చేయగా ఈశ్వరానుగ్రహానికి పాత్రుడవుతావు. ఇప్పుడు నీవు దేహంతో ఎలా తాదాప్యం పొందుతున్నావో అలాగ అప్పుడు నీలోపలఉన్న సద్వస్తువుతో తాదాప్యం వస్తుంది. దేహబుద్ధిని నశింపజేయటానికి నీవుచేసే ప్రయత్నం వృధాపోదు. కాని అది ఒక్కరోజులో పోయేదికాదు. ఈరోజు రామజపం 5 నిమిషాలు చేసాను, కృష్ణజపం 10 నిమిషాలు చేసాను నాకు దేహబుద్ధి ఇంకా పోలేదు ఏమిటి అని ఎదురుచూడకు. ఒక గంటలోనో, ఒక రోజులోనో పోయేదికాదు నీ దేహబుద్ధి. అది దీర్ఘరోగము. చిరకాలం ప్రయత్నంచేయాలి. సాధకుడు సమాధిస్థితిని ప్రాక్టీసుచెయ్యాలి. అలా ప్రాక్టీసు చెయ్యగా చెయ్యగా ఏదో ఒకజన్మలో హృదయంలోఉన్న సద్వస్తువు మెరుపు మెరిసినట్లుగా తెలుస్తుంది. అంతేగాని కంగారుపడితే అది వచ్చివేయదు.

అనేకజన్మలలో నీవు చేసిన పుణ్యబలం, సంస్కారబలంవలన నీకు దేహబుద్ధి నశిస్తుంది. సద్వస్తువు నీకు అత్యంత సమీపములోఉన్నప్పటికీ అది నీకు అనుభవంలోనికి రావటానికి నీవు పవిత్రుడవు అవ్వాలి, అనేక జన్మల పుణ్యఫలం నీకు కలిసిరావాలి. అప్పుడుగాని ఆ వస్తువు నీకు అనుభవంలోనికి రాదు. ఆ వస్తువును పొందాలి అనే కాంక్ష, తపన నీ హృదయంలోనుండి వచ్చినపుడుగాని ఆ వస్తువు నీకు తెలియదు. అహంభావన చాలా బలంగా ఉంటుంది. పవిత్రత, ఏకాగ్రత, సాధనాబలం, పుణ్యబలం ఇవి అన్నీ కుదిరినపుడు అహంభావన దానిపట్టు వదులుతుంది. పరమపవిత్రులతో సహవాసంచేస్తే వారి ప్రభావం నీమీద ఉంటుంది. పవిత్రత నీమీద పనిచేస్తుంది. అప్పుడు అహంకారముఅనే ఏనుగు దానిఅంతట అదే అణిగిపోతుంది. అది ఎంతబలమైనదో అంతకంటే బలంగా నీవు ప్రయత్నంచేస్తే అది నీ స్వాదీనంలోనికి వస్తుంది. నిరంతరము నీవు సాధనచేస్తూఉంటే ఎప్పుడో ఈశ్వరానుగ్రహంవలన అహంభావన అనేతాడు తెగిపోతుంది అంతేగాని నీవు అనుకొంటే అది తెగదు.

ఎవడికైతే శాంతి ఉందో వాడిలోనుండి శక్తి వస్తుంది. అటువంటి శక్తిని సంపాదిస్తే బలీయమైన అహంభావనను తొలగించగలవు. మాయయొక్క ప్రభావము ఎటువంటిది అంటే నీమనస్సును ఎప్పటికప్పుడు అస్థిరంచేస్తూ ఉంటుంది. ఈ ప్రపంచం నిజంకాదు కాని ఇది నిజంలాగ మీకు కనబడుతోంది. మీరు ఎంతసాధనచేయటానికి ప్రయత్నంచేసినప్పటికి మిమ్మల్ని వంపుపెట్టి మీమనస్సు బయటకు వెళ్ళిపోతుంది. అహంభావనే అన్ని గొడవలకు కారణము నీకు కుదురులేకుండా చేసేది, నీ మనస్సుకు అశాంతి తీసుకొనివచ్చేది, జననమరణ ప్రవాహమునకు గురిచేసేది అహంభావనే. అహంభావనకూడా ఒకతలంపు. అది వేరు తలంపు.

అహంభావన చాలా బలంగా ఉంటుంది. దూదిని ఊదినట్లు ఊదేస్తే అది బయటకు పోదు. చాలా కష్టపడి సాధనచేస్తే, బహుజాగ్రత్తగాఉంటే దానిని తొలగించుకోగలము. దానిని ఎదిరించినపుడు అహంభావన దానిబలం చూపిస్తుంది గాని దాని జోలికి వెళ్ళనపుడు దాని బలం చూపించదు. పుణ్యంచేసుకోండి, పూజలు, జపాలు చేసుకోండి ఉత్తమ జన్మలు వస్తాయి అలాచేసుకోండి అంటుంది. అవి చేసుకోవటానికి సహకరిస్తుంది. గురువు అనుగ్రహంలేకుండా నీవు అహంభావన అనే అడవినుండి బయటకు రాలేవు. అహంభావనయొక్క మూలం నీలోపలే ఉంది. అది బయటలేదు. దేహము, మనస్సులోపలఉన్న వస్తువుకి తొడుగులు. ఈ తొడుగులను చూసి కంగారుపడవద్దు. ఈ తొడుగులే నువ్వు అనుకొంటున్నావు. ఈ తొడుగులనుండి బయటకు రావటానికి గురువు అనుగ్రహం అవసరము.

మీరు ఇప్పుడు దేహంగా, మనస్సుగా, అహంభావనగా ఉంటున్నారు. మీరు ఉండగలిగినంతసేపు మీ హృదయంలో ఉండటానికి ప్రయత్నం చేయండి. మీరు అహంభావనగా ఎలా ఉంటున్నారో అలాగే బ్రహ్మముగా ఉండటానికి ప్రయత్నం చేయండి. మీరు దేహముగా ఎలా ఉంటున్నారో అలాగే ఆత్మగా ఉండటానికి ప్రయత్నం చేయండి. ఉండగలిగినంతసేపు సమాధిస్థితిలో ఉండటానికి ప్రయత్నం చేయండి. భోగదృష్టిని ఎంతవరకూ తగ్గించుకోవటానికి అవకాశం ఉందో అంతవరకూ తగ్గించుకోవటానికి ప్రయత్నం చేసినపుడే మీరు బ్రహ్మంగా ఉండగలరు. భోగి అయినవాడు యోగి అవ్వడు, రోగి అవుతాడు. భోగం తగ్గించుకుంటేగాని యోగస్థితి కలుగదు. తెలివితక్కువవారు దేహానికి పరిమితమై ఉంటారు, దేహంతో తాదాప్యంపొంది ఉంటారు. తెలివైనవారు తెలివితో తాదాప్యంపొంది ఉంటారు. వారూ బంధంలోనే ఉన్నారు, వీరూ బంధంలోనే ఉన్నారు. ఇద్దరూ అజ్ఞానములోనే ఉన్నారు. (తెలివైనవారిని చదువుకొన్నమూర్ఖులు అనేవారు భగవాన్.)

దేహంకంటే ఇంద్రియములు గొప్పవి, ఇంద్రియములకంటే మనస్సు గొప్పది, మనస్సుకంటే బుద్ధి గొప్పది, బుద్ధికంటే ఆత్మగొప్పది. చైతన్యస్థాయిలో కొంతమంది దేహానికి, కొంతమంది ఇంద్రియాలకు, కొంతమంది మనస్సుకు, కొంతమంది బుద్ధికి పరిమితమైఉంటారు. ఆత్మానుభవమును పొందినవారు బహుకొద్దిమందిమాత్రమే ఉంటారు. ఉన్నవస్తువును ఉన్నట్లుగా దర్శించినవారు కొద్దిమందిమాత్రమే ఉంటారు. హృదయంలో ఉన్న సత్యవస్తువును ఎవడైతే దర్శించాడో వాడిని ఋషి అంటారు. ఏది నిజం ఏది నిజం కాదు ఏది సత్యం ఏది సత్యం కాదు అని విడదీసుకొనే బుద్ధినే వివేకం అంటారు. ఎవరైనా మాట్లాడుతున్నారు అనుకోండి వినవచ్చు. అన్నీ నమ్మకూడదు. మనం స్వంతంగా ఆలోచించుకోవాలి. సత్యాన్ని తీసుకొని అసత్యాన్ని వదలివేయాలి. మాట్లాడేవారితో పోట్లాడవద్దు.

మనకు మూడు శరీరములు ఉన్నాయి. స్థూల, సూక్ష్మ, కారణ శరీరములు. స్థూల శరీరం అంటే మాంసం, ఎముకలు, సూక్ష్మ శరీరం అంటే మనస్సు, కారణ శరీరం అంటే అజ్ఞానం. ఈ మూడు శరీరములు అహంభావనకే సత్యానికి ఇవి ఏమీ అక్కరలేదు. జాగ్రదావస్థలో నెరవేరని కోరికలు స్వప్నంలో వస్తూ ఉంటాయి. స్వప్నంలో ఆ వస్తువునుచూసి మనస్సు enjoy చేస్తుంది. జాగ్రదావస్థలో శరీరాన్ని ఆలంబనగా చేసుకొని మనస్సు enjoy చేస్తుంది. స్వప్నావస్థలో శరీరంతో సంబంధం లేకుండా మనస్సు enjoy చేస్తుంది. నీ హృదయంలో ఉన్న బ్రహ్మంకు వీటితో సంబంధంలేదు. నీలోపలున్న బ్రహ్మంకు దేనితోనూ సంబంధంలేదు. దాని స్వరూపమే వైరాగ్యము. దానికి ద్వితీయంలేదు. అహంభావనకు వైరాగ్యం కావాలి ఎందుకంటే దానికి బంధం ఉందికాబట్టి. నీవు వైరాగ్యమును పెంచుకో అని కృష్ణుడు చెప్పాడు. ఈ మాటలన్నీ జీవుడికి చెప్పిన బోధ.

ఉపనిషత్‌లు చదివాను, భగవద్గీత చదివాను ఎంత చదివినా నాబుద్ధి దేహందగ్గరకే వస్తోంది. ఇన్ని గ్రంథాలు చదివినా ఆలోచన వచ్చేటప్పటికి దేహం దగ్గరకే వస్తోంది. దేహబుద్ధి అంత బలీయంగా ఉంది, దేహబుద్ధి విడిచిపెట్టటంలేదు అని ఒకరు చెపుతున్నారు. దేహబుద్ధి అంత తొందరగా విడిచిపెట్టదు. నీ శరీరమే నిన్ను మోహపరుస్తోంది. నీలోపలున్న అహంభావన వ్యక్తం కావటానికి దేహం వచ్చింది. నీ దేహంద్వారా, ఇంద్రియాలద్వారా అహంభావన వ్యక్తమవుతూ ఉంటుంది. నిన్ను మొదట మాయలో పెట్టేది నీ దేహమే. ఈ భూమి పెద్ద జంక్షన్‌స్టేషన్‌లాంటిది. జీవుడు వాడి వాసనాబలాన్నిబట్టి ఒక్కొక్కడు ఒకో లోకమునకు ప్రయాణం అవుతూ ఉంటాడు. వాసనలకు, తలంపులకు లోబడి ఉన్నంతకాలము ఏదో లోకాలకి ప్రయాణం చేయకుండా ఎవరూ ఆపలేరు. నీ హృదయంలో ఒక నిజం ఉంది. ఆ నిజం తెలుసుకోవాలంటే నీకు వాసనాక్షయం అవ్వాలి. నీ హృదయంలో ఉన్న నిజం నీకు అనుభవంలోనికి వచ్చేవరకూ నీకు ప్రయాణాలు తప్పవు. జన్మించటం, మరణించటం తప్పదు. మంచిలోకాలకో, చెడ్డలోకాలకో వెళ్ళటం తప్పదు. ఇది తప్పించుకోవటానికి వీలులేని చట్టం. బాహ్య చట్టాలనుండి బయటపడగలవుగాని నీకు భోగదృష్టి ఉన్నంతకాలము ఈ **divine law** నుండి తప్పించుకోలేవు. జీవలక్షణాలు ఉన్నంతసేపు ప్రయాణాలు తప్పవు. జీవలక్షణాలు నశించినరోజున ఉన్నవస్తువు ఉన్నట్లుగా నీకు వ్యక్తమవుతుంది. అప్పుడు పరమస్థితిని అందుకొంటావు.

శబ్దము దేవుడై ఉన్నది అని ఏసు చెప్పారు. **Subject** వినేటప్పుడే శ్రద్ధగా వినండి. వినగా వినగా మీకు తత్వం తెలుస్తుంది. తత్వంమీద రుచి మీకు కలుగుతుంది. జీవలక్షణాలను పోగొట్టుకోవటానికి అప్పుడు మీరు ప్రయత్నం చేస్తారు. విసుగువచ్చేలా శ్రవణం చేయాలి. **Subject** శ్రద్ధగా వింటే అది అర్థమవుతూఉంటే ఇక్కడే 50% మార్కులు వచ్చేస్తాయి. వినేటప్పుడే బాగా ఉపయోగించుకోవాలి. శ్రద్ధగా వినండి. అర్థంచేసుకోండి. ఆశబ్దంయొక్క తాత్పర్యాన్ని ఇంటికి వెళ్ళి మననం చేయండి. అది మీకు అనుభవంలోనికి వస్తుంది. ఒకవేళ అనుభవంలోనికి రావటానికి ఏదైనా వాసన అడ్డువస్తూఉంటే ఆ వాసన ఏమిటో అర్థం చేసుకొని దానిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేయండి. అది కేవలము మీ తెలివితేటలవలన తొలగించుకోలేరు. అప్పుడు మీకు గురువు అనుగ్రహం ఉండాలి. మనం పక్వస్థితికి వచ్చినపుడు మన హృదయంలోఉన్న ఈశ్వరుడే గురురూపంలో కాళ్ళు, చేతులు తొడుక్కొనివచ్చి మనకి బోధిస్తాడు. జరిగిపోయిన గొడవలు రోజూ తలపెట్టుకొంటూఉంటే మనం మాయలో ఉన్నట్లు గుర్తు. మన మనస్సు భగవంతునివైపుకు వెళ్ళకుండా ఉండటంకోసం జరిగిపోయినగొడవలు జ్ఞాపకం వస్తాయి. ఇది అంతా మాయ. మాయఅంతా మనస్సులో ఉంది. మనస్సు నశిస్తే మాయ నశిస్తుంది. సాధ్యమైనంతవరకూ ఇతరుల గొడవలలోనికి వెళ్ళకండి. మీరు బాగుపడేవిధానం చూసుకోండి. అప్పుడు మిమ్మల్ని చూసి కొంతమంది బాగుపడతారు.

వారు ఇలా అన్నారు, వీరు అలా అన్నారు అని తలపెట్టుకొని కాలమును పాడుచేసుకోవద్దు. కాలమును సద్వినియోగం చేసుకోండి. మనస్సు, మాట, చేత నిదానంగా ఉండాలి. ఇవి మూడూ నిదానంగా ఉంటే బ్రహ్మం ఎరుకపడటానికి ఇవి సహకరిస్తాయి. పొగడ్తలను చూసి పొంగిపోవద్దు, విమర్శలను చూసి కృంగిపోవద్దు. శాంతిగా ఉండాలి. శాంతివలన నీకు శక్తి వస్తుంది, జ్ఞానం కలుగుతుంది అంటున్నారు ఆచార్యులవారు. నిన్ను ఎవరో ఏదో అన్నారని ఆ ప్రవాహములోనికి వెళ్ళిపోవద్దు. నీవు శాంతిని కాపాడుకో. ఎవడైతే శాంతిలో స్థిరపడ్డాడో వాడి సమక్షంలో ఉన్నప్పుడు మీ మనస్సు చల్లబడుతుంది. నీకు శాంతి కలుగుతుంది.

❋ ❋ ❋